కథ

# చిరిగిననోటు

- ఓ.యం. గోపాల్‌రావ్

సంతానంగారు, ఆ టౌన్‌లో పేరు, పలుకుబడి వున్న లాయర్లలో ఒకరు. ఆయన తండ్రి, తాతలు గూడా, ఆ రోజుల్లో ప్లీడర్ పరీక్ష పాస్ అయి, ఆ వృత్తిలో రాణించినవారే. వారి పూర్వీకులు తమిళ ప్రాంతాల నుండి, తెలుగు దక్షిణ జిల్లాలలో, స్థిరనివాసాలు ఏర్ప రచుకుని అయిదారు తరాలయింది. ప్రస్తుతం సంతానం గారి తరం, భాష, వేషం, ఇతరత్రా కూడా, సిసలైన తెలుగువారుగా కనపడినా ఇప్పటికీ భోజనంలో, సాం బారు, రసం, అప్పడం, ముప్పూటలా సేవించకుండా పూట జరగదు. సరే ప్రొద్దున్నే 5 గం. కల్లా స్ట్రాంగ్ కాఫీ మస్టు. వారి అదృష్టం కొద్దీ, శాస్త్రీయ సంగీత అభిమానం, ఆవకాయ వూటలో కొట్టుకుపోలేదు. సంగీతం అంటే, కుటుంబీకులంతా చెవికోసుకుంటారు. సంతానం అయ్యంగారు, కాలానుగుణంగా సంతానం దగ్గరే, తమ పేరు నిల్పేశారు, తెనుగు దనం కోసం, రాధా కృష్ణగారు, తమిళ దనం కోసం 'కృష్ణన్' అయినట్లుగా.

మరి సంతానం గారికి, ఏ ముహూర్తాన నామ కరణం జరిగిందో, పేరు నిలబెట్టుకున్నారు. వరుసగా అయిదుగురు ఆడపిల్లలు, ఒక వంశోద్ధారకుని సతీమణి సుభ ద్రమ్మగారు ప్రసాదించారు. వాడి కోసం, పోయినవి పోగా ఇన్ని కాన్పులు కష్టపడిందా తల్లి. షష్టి పూర్తి అయి ఏడుసంవత్సరాల యిన సంతానంగారికి, పిల్లల చదువులు, పెండ్లిండ్లు, తల్లి తండ్రులను కడతేర్చి ఒడ్డున పడేటప్పటికి, దేవుడు దిగి వచ్చాడు. రిటైర్‌మెంటులేని వృత్తి పైగా ఎంత అనుభవం వుంటే అంత సంపాదన. ఇప్పుడు తాపీగా చేసిన అప్పులు తీర్చుకుంటూ, మనమళ్ళు, మనుమరాండ్ర సందడితో, సెలవులకు వాళ్ళొచ్చినప్పుడు ఒక రకమైన ప్రశాంత జీవితం సాగిస్తున్నారు. ఇంట్లో ఇతరులతో సంతానం గారు ఎంత మిత భాషో, కోర్టులో దీనికి విరు ద్ధంగా, వాగ్ధాటి వాదనా చాతుర్యం, చమత్కారం చూపే మంచి లాయర్.

సుభద్రమ్మగారు, గోదావరిఖనిలో జన్మించిన మణి. పక్కా తెలుగు రూట్సు. వారి వివాహం, కావేరీ గోదావరుల సంగమం. పెద్ద అందగత్తె కాకపోయినా, సంసారపక్షంగా అందర్నీ తన మాట, ప్రవర్తన తీరునా ఆకట్టుకునే తెలివి తేటలున్నాయని తనకూ తెలుసు. ఆమె తండ్రి బ్యాంక్ ఆఫీసరుగా ఎప్పుడో రిటైరయ్యాడు. కూతుర్ని ఆ రోజుల్లోనే గ్రాడ్యుయేట్ అనిపించాడు. బహుశ కన్నుమూస్తూ కూతురికి రెండు ముఖ్యమైన సంసార సూత్రాలు చెవిలో వూదుంటాడు, పర్యవసానంగా సుభద్రమ్మ తన సంసార సవారీ సక్రమంగా సాగాలంటే, ఇంట్లో పొదుపు, ఇంటాయనపై అదుపు, అనే రెండు చక్రాల మీద ఆధారపడాలనుకుంది. మొదటి చక్రం అవసరం కనబడ్తూనే వుంది. సంతానంగారి భార్యగా రెండవ చక్రం అవసరం, అర్ధం కాని వ్యవహారం. అమితభాషిని, తన కుటుంబం కేవలం తన తెలివి తేటల వల్లనే ఎక్కి వచ్చిందనే భావనకు తోడుగా పుట్టింటి వారిచ్చిన రెండెకరాల భూమి, ఈమెలో ఒక మోస్తరు అహం పెంచింది. సంతానం గారికీ, ఈవిడకీ, సంగీతాభిమానంలో తప్ప, ఇతరత్రా పొంతన కుది రినట్లు కనపబడదు. సంతానం గారి అదృష్టం అనాలి ఇదైనా.

అందరూ ఒకరిని పోలిన విధంగా ఒకరు, కార్బన్ కాపీలా వుంటే సృష్టికర్తను పొగడాల్సిన అవసరమే ముంది. వెరైటీ, లైఫ్‌కే కాదు సృష్టికి కూడా సుగంధ ద్రవ్యం లాంటిది. మార్పు, చేర్పు, కూర్పు, సుఖ దుఃఖాలు, వెలుగు చీకటులు వుంటేనే కానీ జీవితమని పించుకోదు.

❊ ❊ ❊ ❊ ❊

ఆ రోజు కోర్టులో ఒక డైవోర్సు కేస్ వాదిస్తున్నారు సంతానంగారు. తన క్లైంట్‌కు, అతని భార్యకు. ఇంత జరిగాక, మామూలు సంసార జీవితం కష్టమని, విడిపోతే ఇద్దరూ సుఖంగా బ్రతుకుతారనంటూ.

"యువర్ ఆనర్, అసలు ఇలాంటి సమస్యలు, హిందూ సమాజ వ్యవస్థలో నుంచి ఆవిర్భవిస్తున్నాయేమో అని అనిపిస్తుంది. స్త్రీ పురుషులమధ్య పెండ్లినాటి, లేక పెండ్లి పూర్వ ప్రేమ, అదే గాఢంగా, జీవితాంతం వుంటుందని, వుండాలని అనుకోడం అవాస్తవిక ఆలోచననాలి. సంసారం ఒక సాగరమైతే, ఆటుపోటులు లేకుండా కెరటాలు ఒడ్డు చేరగలవా? వీటిని తట్టుకోడా నికి హిందూ సమాజం, అవసరమైన 'కుషన్స్,' 'షాక్ అబ్జార్బర్స్,' పాశ్చాత్య సమాజాల్లా - కలిగించలేదను కుంటాను. స్త్రీ పురుష సంబంధాలు, వివాహ పూర్వ, పరాలలో ఒక 'టైట్ జాకెట్,' హిందూ సమాజంలో. ఆ సమాజాలలో వున్న ఒక రకమైన, అవసరమైన, స్వేచ్ఛా వాతావరణం, హిందూ సమాజంలో లేదనే చెప్పాలి. డేటింగ్, డైవోర్సు, తలాక్, పునర్వివాహం బహుభార్యా సాంప్రదాయం, ఇలా చాలా ద్వారాలు తెరిచారు వుద్రిక్తతలు తగ్గడానికని. ఈ కారణాలవల్ల కుటుంబ ఘర్షణలు ఎక్కువగా వుండవేమోననిపిస్తుంది. హిందూ సమాజంలో, ముఖ్యంగా మధ్య తరగతి కుటుంబాలలో, 'భార్య, భర్త - ఆమె' ఒక చిక్కు సమస్యగా తరచు వింటున్నాం, చూస్తున్నాం. కలసి వుండలేరు. విడిపోలేరు. సతీసహగమనం, ఏక పత్నీ 'వ్రతం,' వేళ్ళుగా ఎదిగిన సమాజం మనది. సాంప్రదాయం ఎంత పురాతనమైతే, అంత తీవ్రంగా వుంటుంది అంతఃకలహం. అలా అని చెప్పి,హైందవ సమాజం, కుటుంబ వ్యవస్థలో ఆదర్శమైన అంశాలు లేవని నేనటంలేదు. యువర్ ఆనర్, మరి ఎక్కడో ఏదో వ్యవస్థాపరంగా కొంత లోపం వుందేమో. ఏది ఏమైనా ఈ ఘర్షణకు మగవాడే కారణమని పదే పదే నిందించడం పూర్తి సత్యం కాదనుకుంటాను. 'పొసెసివ్‌నెస్,' 'నాది, నావాడు' అనే గట్టి భావం నాటుకున్నప్పుడు ఇటు అత్తమామలతోగానీ, భార్యా భర్తల మధ్యగానీ, వైషమ్యాలు పెరిగే అవకాశం ఎక్కువ. అవసరమైన సాక్ష్యాలు ఈ డైవోర్సుకు సంబంధించి ప్రవేశ పెట్టడమైంది ఇదివరకే. వీరు సంవత్సరం పైగా విడిపోయి, జీవనం చేస్తున్న కారణంగా మా క్లైంటుకు డైవోర్సు ఇప్పించాలని కోరుతున్నాను" అని చెప్పి కూర్చున్నారు సంతానంగారు.

❊ ❊ ❊ ❊ ❊

"ఇవాళ కోర్టులో ఏదో గొప్ప వుపన్యాసం దంచేశా రట తమరు. భార్యలను రాచి రంపాన పెట్టడం, వాళ్ళు భరించలేక ఎదురు తిరిగితే, డైవోర్సు, పిటిషన్ పెట్టడం. బాగుంది. అసలు అలా వాదించక మరెలా వాదిస్తారు. మగమహారాజులు" అంది సుభద్రమ్మగారు, దెప్పుతూ, ఇంటాయన కోటు పూర్తిగా విప్పకముందే.

"నీకెవరు చెప్పారు ఈ కేస్ గురించి" అడిగాడు భర్త.

"ఎవరు చెప్తే ఏం? గుమాస్తా భద్రయ్య, తమర్ని పొగుడ్తూ చెప్పాడు. తప్పా? లేండి, టిఫిన్ చేద్దురుగాని" అంది సుభద్రమ్మ విషయాన్ని మార్చి.

సంతానంగారు, తను ప్రాక్టీస్ ప్రారంభించిన కొత్తల్లోనే తెల్సుకున్నాడు, వాదన కోర్టులో తప్పు, ఇంకెక్కడా చేయకూడదని.

దంపతులిద్దరూ ఒక సాయంత్రం టివి చూస్తున్నారు. సమాజంలో స్త్రీకి జరిగే అన్యాయాలు, అత్యాచారాలు రకరకాలైనవి. మహిళాభ్యుదయానికై, అంకితభావంతో కృషి చేస్తుంది రోజుల్లో మీడియా. కథ 'ఫార్ములా' కథే. భార్య, భర్త, 'ఆమె'. భార్య సహజమైన ఆగ్రహావేశాలతో న్యాయం నాటకీయంగా అడుగుతోంది, నాయకురా లుగా.

సుభద్రమ్మగారు స్పందించకుండా వుండలేకపో యారు. "అసలు మీ మగవాళ్ళకుండే 'క్రానిక్' జబ్బిది. పతి వ్రతా ధర్మాలు మాకు, పర్మిసివ్ సరదాలు మీకు. నేనైతే, పిల్లలు లేకుంటే, ఎప్పుడో విడాకులు తీసుకునే దాన్ని. పాడు బుద్ధులు."

ఇలా కథ జరుగుతున్నంత సేపు ఒక రన్నింగ్ కామెంటరీ. ఇలాంటి కథలు, సినిమాల్లో, రేడియోల్లో, టి.విలో వస్తున్నంతసేపు, సమానాంతరంగా ఈ ధోరణి ఒక ఫీచర్ అయింది వారి ఈ నలభై ఏళ్ళ వైవాహిక జీవితంలో. ఎక్కడో, ఏదో పొరపాటు చేసిన వాడిలా సంతానం, తాను ప్రతి వాదనకు దిగకుండా చాలావరకు ఇన్ని సంవత్సరాలూ గడపగలిగాడు

కానీ ఈ సాయంత్రం ఎందుకనో, "చూడు సుభద్రా, డైవోర్స్ ఇచ్చుంటే బ్రతికి పోయుండేవాణ్ణి. నీ పాతివ్రత్యం, నీ నైతిక వుపన్యాసాలు, నా ప్రాణాలు ఇలా పిండేయ కుండా వుండేవి. ఒకటి గుర్తుంచుకో. మానసికంగా కూడా తప్పు చేయని వ్యక్తి వుండడం చాలా చాలా అరుదు. టు యర్రియాజ్ హ్యూమన్' అంటే లెక్కలు, కూడికల్లో గాదు. జీవితంలో. జీవిత సంఘటనలు, ఒడుదుడుకులు, తప్పు చేయిస్తాయి. ఇలా ప్రతి రోజూ నీ పాతివ్రత్యం నీ నైతిక సంస్కారం, కొట్టొచ్చేట్టుగా కామెంట్ చేయడం, ఇది నీకు తెలియని, నీలో వున్న మానసిక జబ్బు తెలుసా? అందుకే అలవాట్లు త్వరగా చావవంటారు." అన్నారు కొంచెం కటువుగా సంతానంగారు.

"మీలా నేను లాయర్ కాదుగా తెలివిగా సమర్థించుకోడానికి మీకేం తెలుసు మా బాధ. ఏదో జరిగిపోయిందిలే అనుకోడానికి, ఇవి మనసుకు తగిలే గాయాలండీ. మానవు, మాసిపోవు. పగిలిన అద్దపు ముక్కలు అతకవు."



Vemakoti Seeta Rama Sastry
WRITER A B JAO (Retd)
RAMAKRISHNA NAGAR
Plot No. 24
SRIKAKULAM.

"కొంచెం ఆగు సుభద్రా. ఏదో సినిమాలో మనం విన్నాం కదూ ఈ డైలాగ్" అన్నారు సంతానం, సుభద్ర రౌద్రానికి అడ్డుతగిలి.

సుభద్ర బాధ వ్యక్తం చేస్తూ, "మగవాడి ప్రాబల్యం వున్న ఈ వ్యవస్థ మారితే కాని, ఇలాంటి పరిస్థితులు ఆగవండీ. ఆడది ఆట వస్తువు కాదండీ."

"సుభద్రమ్మగారూ, మగవాడు మద్దెల కాదండి, రెండు వైపులా వాయించడానికి" అని క్లుప్తంగా సమాధానమిచ్చారు సంతానంగారు.

భోం చేయటం తప్పదు కాబట్టి, మొగాలు ముడుచుకుని మౌనంగా భోంచేశారాపూట. ఆ తర్వాత వారి గదికి వెళ్ళి మాటా పలుకు లేకుండా పడుకున్నారు ఆరాత్రి.

* * * * *

**కో**డి కూత, నమాజ్ పిలుపులు, గోడ గడియారం కొట్టే ఐదు గంటలు, సంతానంగారి మేలుకొలుపులు. లేవగానే, మాంచి కాఫీ ఒక ఫుల్ కప్ తాగితేనే రోజు సక్రమంగా ప్రారంభమయినట్లు. ఇంట్లో వున్న వాతావరణంలో, సుభద్రమ్మ నూరు పాళ్ళు ఆరోగ్య రీత్యా ఫిట్ కానందున, ఈ ప్రక్రియతనకై తానేచేస్తే, సుప్రభాతాలు, లేకుండా ముందున్న రోజంతకీ ఒక మూడ్, ఒక టోన్ కల్గుతుందనే నిర్ణయానికి మూడు దశాబ్దాల ముందరే వచ్చారు సంతానంగారు. పైగా ఆ సూర్యోదయానికి ముందు, కనీసం ఒక గంట ప్రశాంత వాతావరణంలో, ప్రకృతి ఒడిలో, నడిస్తేగానీ తృప్తి వుండదు తనకి. తిరిగి ఇంటికి వచ్చి చల్లని నీటితో స్నానం చేస్తే, అదొక అనుభూతి. స్నానమయ్యాక నేరుగా తన ఆఫీస్ గదిలో కూర్చొని కేసులు, వాయిదాలు, బ్రేక్ ఫాస్టకు, సుభద్రమ్మ గారు పిలిచే వరకు. ఇది కావాలని, అది బాగా లేదనీ, బ్రేక్ ఫాస్టన గానీ భోజనంలో గాని, అనే ప్రసక్తే లేదు. ఏది చేస్తే దానితో సరిపుచ్చుకోవడమే.

ఈ నలభై ఏళ్ళ ప్రాక్టీసులో, కేసులు, డైవోర్సులు, కోడళ్ళని అత్తవారింట హింసించటం, దారుణ దహనాలు, అత్తమామల్ని వృద్ధాప్యంలో వీధి కెక్కించడం, భర్తలు అసూయ, అవమానాలతో కృంగిపోవడం. ఆత్మహత్యలు, ఒకటేమిటి సమాజంతో ఎందరికి ఎన్ని విధాల కుటుంబ పరమైన క్షోభలున్నాయో, చూచి, తరిచి, ఒక వేదాంత దృక్పధంలో ప్రతివారు, చాలా విషయాలలో సర్దుకుపోకల్గితే సమస్యలుండవనే నిర్ణయానికి వచ్చారు సంతానంగారు.

ఇంగ్లీషులో 'స్పిరిట్ ఆఫ్ కాంప్రమైజ్' అంటారు. సుభద్రమ్మగారికి పూర్తి ఆరోగ్యం లేదనో, వయసు మళ్లిందనో, అప్పుడప్పుడు కొంత ఖర్చైనా ఒక వంటావిడను ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని భార్యతో అనేవారు. ఆమె ససేమిరా వద్దంది.

"ఎందుకూ మీ ప్రాక్టీస్ ఎక్కువయిందనా? ఇంట్లో వస్తువులు బయటికి చేరవేయడానికనా? మన సౌరభ్యం వూరంతా తెలియాలనా? లేక వంటావిడ, ఇంటావిడవుతుందనా? ఏదో నా కష్టం నేచేసుకుంటానుకాని,

వంటావిడ ప్రసక్తి తేవద్దు ఇక మీదట." అని ఒక దండకం చదివేది.

సుభద్రమ్మకు నోటి దురుసే కానీ, అదీ ఆయన ముందరే, ఇతరుల దగ్గర సంస్కారవంతురాలనే అనిపించుకుంది. పొదుపు విషయంలో కూడా లోభి కాదు. ఒకరిది ఆశించదు, ఇంకొకరికి వితరణ లేకుండా ఇవ్వదు. ఎప్పుడూ ఇవాళ వున్నట్లు రేపుండదేమోననే ఆరోగ్య రీత్యాగాని, ఆర్థికంగాగాని ఒక భయం, ఆందోళన అమెను సర్వత్రా అంటి పెట్టుకుని వున్నాయి. భర్త సంతానం పూర్తి ఆశావాది. ఆమె రాబోయేవి వూహించుకుని కుమిలిపోతే, ఆయన గడ్డు సమస్యలు వచ్చినా, నిమ్మకు నీరెట్టినట్లు తొణకడు, వణకడు.

ఒక వుదయం, సంతానంగారు, బ్యాంకుకు పోతూ, తన నల్లకోటు పాకెట్‌లో పెట్టిన, కొంచెం చిరిగిన యాభై రూపాయల నోటు తీసుకెళ్దామంటే లేదు.

"సుభద్రా ఈ కోటులో చిరిగిన నోటు తీశావా?" అని అడిగాడు.

"ఆ తీశాను, చాకలావిడకివ్వాల్సొస్తే, మార్చుకుంటుందిలే ఎలాగో అని ఇచ్చాను."

"పోనీ, చెప్పి ఇచ్చావా చిరిగినదని."

"ఎందుకు? మారకపోతే, అదే తిరిగి వస్తుందిగా అదేం అంత తెలివి తక్కువదిగాదు. ఎందుకో ఈ క్రాస్ ఎగ్జామినేషన్, నేరం చేసినట్లు."

"మరినీకున్నంత తెలివి ఆమెకుండొద్దూ" అని, నాలుక కొరుక్కున్నారు సంతానం.

"ఏమిటీ నేను తెలివికల దానినా! ఈ రోజు వరకు నేనెప్పుడైనా మీకెంతొస్తుంది జీతం, ఏం దాచారు, ఏం ఖర్చు పెడ్తున్నారని, ఎప్పుడైనా నేనడిగానా, మీరు చెప్పారా? అదే మీనాక్షి గారిని చూడండి. ఆయన జీతపు రాళ్ళు ఇంట్లో పోయడంవరకే. బ్యాంక్‌లు, ఖాతాలు, ఒకటేమిటి అంతా అమె మేనేజ్‌మెంటే. అయనకు పాకెట్‌మనీ కూడా ఆమె ఇవ్వాల్సిందేనట."

"ఎవరిచ్చారు నీకీ న్యూస్." అడిగారు సంతానం.

"ఎవరేంటి, మన చాకలి రామి. మీనాక్షి గారు సగర్వంగా చెప్పిందట, రామి జీతం ఎక్కువ కావలన డిగితే. ఇప్పుడు చెప్పండి నేను తెలివిగల దాన్నా. ఎప్పుడూ ఏదో లోభిని చూసినట్లు చూడడమేకాని, ఇదంతా సంసారం కోసం పొట్లనే ఆలోచనుందా మీకు? మా నాన్నగోదావరి డెల్టాలో రెండు ఎకరాలివ్వక పోతే, మీది అనేది మీకెముందండి, నల్ల కోటు తప్ప! సంసారం పూర్తిగా మీ కొదిలేస్తే, మీ కోర్టు కాంపౌడులో, ఒక చెట్టు మనకు నీడయ్యేది" అని దెప్పింది.

ఇలా మాట్లాడుతున్న నేపథ్యంలో, రామి తిరిగి వచ్చి, "అమ్మగారూ, చూస్తూ చూస్తూ ఇలాంటి నోటెలా ఇచ్చారమ్మా? నేనైనా చూసి వుండాల్సింది. వెచ్చాలాయన మొహాన ఇసిరేసి, మీ ఆయనకు పెట్టు పో చెవిలో పూవు, నాకు కాదని తిట్టాడమ్మా" అని నోటు వాపసు ఇచ్చింది.

సుభద్రమ్మ చాలాబాధతో, "అయ్యో, నేనూ చూడలేదే రామీ, ఇదెవడు తగలగట్టాడో ఆయనకి. వేరే దిస్తాలే" అని మంచి నోటు ఇచ్చింది.

రామి వెళ్ళాక, సంతానంగారు, చినిగిన నోటు తీసుకుని,

"చూడు సుభద్రా, మగవాళ్ళు, మగవాళ్ళని గావు కేకలు, ఇండ్ల కప్పులపై నిలబడి పెడ్తారు, మీరు. నిజానికి, మీ ఆడవాళ్ళే మీకు శత్రువులు. మిమ్మల్ని మీరే తక్కువగా చూస్తారు, మగవాళ్ళు కాదు. ఇరవై కేజీల షండ్ల బుట్ట మోస్తూ, ఎత్తుతూ దింపుతూ ఎగశ్వాస పీల్చే పండ్లామె దగ్గర, ఎంత బేరం చేస్తారు! పరాయి పిల్ల కోడలుగా వస్తే, కుతురులాగా చూసుకునే, అత్తగార్లెందరు, సాదరిలా ఆప్యాయంగా ఆదరించే ఆడబిడ్డ లెందరు? అపవాదులు ఏవైనా ప్రసారమయ్యేది, ఇరుగింటి పొరిగింటి అమ్మల పుణ్యమే కదా? మొన్న బంగారు గొలుసు కనపడలేదని నీ మాటవిని, పని మనిషి మీద పోలీస్ రిపోర్టు ఇచ్చి వుంటే, పాపం దాన్ని ఎంత హింసించేవారు? తీరా దిండు గలీబులో దాచి, మరచినదానికి. కొడుకు కోడలు విడిపోయారనే దుఃఖం లేకపోగా, కొత్త కోడలు ఇంకా ఎక్కువ కట్నం పట్టుకొస్తుందని మురిసే అత్తగార్లెంతమందిలేరు, ఈ సమాజంలో?" అని చాలా వుద్వేగంతో అన్నారు సంతానంగారు.

సుభద్రమ్మ మొదటిసారిగా ఆలోచనలో పడింది. ఎవర్నంటున్నారీయన, తన్నా, ఆడవాళ్ళనా? అర్థం కాలేదు. సంతానం గారు బ్యాంక్‌కని బయలుదేరారు.

"ఏమండీ, వస్తూ అరకిలో కాఫీ పొడి, పావుకిలో టీ ప్యాకెట్, తీసుకురండి, ఇంక మీదట సాయంత్రం మీకు టీయే" అంది.

"ఆ ప్రశ్నేలేదు. కావల్సి వుంటే నువ్వే టీ తాగు" అని గుమ్మం దాటారు కాఫీ ప్రాణి సంతానంగారు. అలా నిలబడి పోయింది ఆమె, 'ఏమిటి ఈ విచిత్రం' అన్నట్లు.


వచ్చే సంచిక

## సంక్రాంతి విశేష సంచిక!

కొత్త సంవత్సరంలో క్రొంగొత్త మార్పులతో
సరికొత్త రుచులతో వెలువడుతోంది
మీ అభిమాన మాసపత్రిక

# వనిత

● వినోదానికి ● విజ్ఞానానికి ● వికాసానికి